بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ        نَحْمَدُهٗ وَنُصَلِّی عَلٰی رَسُوْلِهِ الْكَرِيْمِ        وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 18.09.2015 (Telugu)

**ఈ కాలములో ఆ(హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధన, పవిత్ర ఆదర్శమునకు నిజమైన స్ఫూర్తి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం. ఈ విధముగా వారి నడవడి కూడ మనకు ఆచరించదగ్గ మార్గము. మన పెద్దలు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కథనములను మనకందించుట మన అదృష్టము. ఎందుకనగా ఇదే విషయము రాబోవు తరాలకు ఉపదేశము, నిజమైన బోధన, పలు సమస్యల పరిష్కారమును చూపుటకు కారణమగును.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 18.09.2015 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించిరి.

అల్లాహ్ తఆలా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బానిసత్వములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ఈ కాలములో ధర్మ పునరుజ్జీవము కొరకు పంపెను. ధర్మ మూలమును, పునాదిని, నిజమైన బోధనను వారు మనకు అందముగా చేసి చూపిరి. దురాచారములను, తప్పుడు కథనములను దూరము చేయుటకు బోధించిరి. ఈ కాలములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధన, పవిత్ర ఆదర్శమునకు నిజమైన స్ఫూర్తి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం. ఈ విధముగా వారి నడవడి కూడ మనకు ఆచరించదగ్గ మార్గము. మన పెద్దలు, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరులు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కథనములను మనకందించుట మన అదృష్టము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గురించి తమ పెద్దల నుండి నేరుగా పలు సంఘటనలను, కథనములను విన్న వ్యక్తులు పాత అహ్మదీయులలో చాలా మంది యుండవచ్చును. వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను దర్శించి, వారి సహవాసము నుండి కూడ లబ్ధి పొందియుండవచ్చును. ఈ కథనముల ప్రాముఖ్యతను ఒక చోట హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్హు ప్రస్తావించిరి. బాహ్యముగా నున్న చిన్న చిన్న విషయముల నుండి తమ అంచనా మేరకు అనేక సందేశాత్మక విషయములను, ఇస్లాం ప్రాథమిక బోధనను వెలికితీసిరి. వాటిని నేనిప్పుడు ప్రస్తావింతును. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్హు హయాంలో ఎంతో మంది అనుచరులుండిరి. ఈ కథనములను క్రోడీకరించాలని వారు అనుచరులను లేదా వారి బంధువులను ఉపదేశించిరి, సూచించిరి. భావి తరాలకు ఈ విషయములే ఉపదేశము, నిజమైన బోధన, పలు విషయములను పరిష్కరించుటకు కారణమగును. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఒక చోట ఇట్లనిరి. ఈ సం॥ నేను జమాఅత్‌కు ఒక విషయము వైపు సూచించితిని. అదేమనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంఘటనలను, వారి ప్రవచనములను అనుచరుల నుండి సేకరించవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గూర్చి అతి చిన్న విషయము ఒక వ్యక్తికి గుర్తుండి, దానిని దాచి పెట్టి, ఇతరులకు చెప్పకపోవడం జాతీయ అవినీతి అగును. నిస్సందేహముగా పలు విషయములు చాలా చిన్నవిగా యుండును కాని ఫలితము పరంగా అవి చాలా ముఖ్యమైయుండును. హదీసులలో వచ్చిన ఈ చిన్న విషయమునే చూడగలరు. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం కొరకు ఒక సారి సోరకాయ (ఆనిక్యాయ) వండబడెను. వారు ఎంతో ఉత్సాహముతో ఆ పులుసులో నుండి సోరకాయ ముక్కలను తీసుకొని భుజించిరి. తుదకు ఆ పులుసులో ఒక్క సోరకాయ ముక్క

కూడ మిగలలేదు. సోరకాయ చాలా గొప్ప వస్తువని వారనిరి. వారిట్లనిరి. బాహ్యముగా ఇది చాలా చిన్న విషయము. సోరకాయను ప్రస్తావించవలసిన అవసరమేమున్నదని కొందరు అహ్మదీయులు కూడ నేడు అనవచ్చును. నేడు చదువుకున్నామని అధికముగా భావించే కొందరికి ఈ విషయముల వైపు శ్రద్ధ యుండదు. లేదా సాధారణ విషయమని భావింతురు. కాని ఈ చిన్న విషయముతో ఇస్లాంకు ఎంతో మేలు కలిగెను. ముస్లిములలో చోటుచేసుకున్న దుష్టత్వములను మనము నేడు అంచనా వేయలేము. ఇస్లాంపై ఒక కాలము ఇట్లు వచ్చెను. భారతదేశములో హిందు సమాజము ముస్లిములను ఎంత ప్రభావము చేసెననగా మంచి, ఉత్తమోత్త ఆహారము తినక, మలిన వస్తువులు తిన్నవారే పుణ్యులని భావించసాగిరి. ఎందుకనగా ఇదే ఫక్కీరుల, సన్యాసుల తీరు. మంచి ఆహారము తినుచుండగా ఎరినైనా చూచినచో ఇతడెట్లు సత్పురుషుడు అగుననని అనేవారు. అనగా ఒక సత్పురుషుడు మంచి ఆహారము తినగలడని ఊహించనేలేరు. వారొక సంఘటన ఇట్లు తెలిపిరి. ఒక సారి హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ (రజి) పాఠము చెప్పి తమ ఇంటికి తిరిగి పోవుచుండిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పలావ్, బాదామ్ రోఘన్ వాడుతారని హిందు అయిన ఒక విశ్రాంత డిప్యూటి వినియుండెను. అనగా లభించినప్పుడు, వండినప్పుడు బాదామ్ రోఘన్ వాడేవారు. ఆ హిందు అప్పుడు ఇంటి ముందు కూర్చొని యుండెను. హజ్రత్ ఖలీఫా అవ్వల్ (రజి)ను చూచి మీతో ఒక విషయము అడగాలి అని అనెను. ఏ విషయమో చెప్పండని మౌల్వీ గారనిరి. బాదామ్ రోఘన్, పలావ్ వాడుట సమంజసమేనా ? అని ఆ హిందు అడిగెను. మా మతములో ఈ వస్తువును తినవచ్చును, ఎలాంటి అభ్యంతరము లేదని హజ్రత్ ఖలీఫా అవ్వల్ (రజి) అనిరి. దీనిని ఫక్కీరులు తినవచ్చునా ? అని నా ఉద్దేశమని ఆ హిందువు అనెను. వారిట్లనిరి. మా మతములో ఫక్కీరులకు, సత్పురుషులనబడు వారందరికి సమంజసమే అని అనిరి. అటులైనచో సరే అని అతడు మౌనము వహించెను. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. పలావ్, బాదామ్ రోఘన్ వాడే వ్యక్తి మసీహ్, మహ్ది ఎలా కాగలడనే విమర్శ ఈ వ్యక్తికి కలిగెను. నేటి అహ్మదీయుల వలె అనుచరులు యుండినచో వారు హదీసులలో సోరకాయను ప్రస్తావించేవారు కాదు. ఎంత ముఖ్యమైన విషయము యుండిపోయేది. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సారి మంచి చొక్కా ధరించి శుక్రవారము రోజున మస్జిదునకు వచ్చిరని హదీసులలో గలదు. మంచి వస్త్రము ధరించుట ఫక్కీరుల, సత్పురుషుల, సత్యవంతుల లక్షణము కాదని వాదించే ఏ వ్యక్తి అయినా పుట్టినచో అటువంటి వ్యక్తికి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం శుక్రవారము రోజున శుభ్రమైన చాలా మంచి దుస్తులు ధరించేవారని మనము ఈ హదీసు ద్వారా చెప్పవచ్చును. వారు పరిశుభ్రతను ఎంతగా పాటించేవారనగా కొందరు సూఫీలు ఉదా॥ షాహ్ వలియుల్లాహ్ ముహద్దిస్ ఢిల్లీ గారు ప్రతి రోజు క్రొత్త దుస్తులు అనగా ఉతికిన లేదా క్రొత్తగా కుట్టించిన దుస్తులు ధరించే పద్ధతిని అవలంభించిరి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ (రజి) ఎంతో సాధారణమైన స్వభావికులు. చాలా విషయములను వారు పట్టించుకునేవారు కాదు, పనులు చాలా ఎక్కువనే యుండెడివి. అందుకే కొన్ని సార్లు శుక్రవారము దుస్తులు మార్చుకొనుట, స్నానము చేయుట కూడ మరచిపోయేవారు. ధరించిన దుస్తులలోనే జుమా చదువుటకు వచ్చేవారు. ఇది నిరాడంబరత వల్లనే కాని ఫక్కీరుల దుస్తులే యుండాలని కాదు. సత్పురుషునిగా భావించబడాలని దుస్తులు మార్చకపోవడం కాదు, పని ఒత్తిడి వలన గుర్తుండేది కాదు. కాని అపరిశుభ్రముగా యుండుటను సూఫీల లక్షణమని మన కాలములో భావించడం మొదలైనది. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఈ విషయమును పద్య రూపములో చెప్పినచో ఎంత దుర్గంధుడో అంతే దైవ ప్రసన్నుడు అని అనవచ్చును. వాస్తవానికి మానవుడు ఎంత దుర్గంధుడో దేవుని నుండి అంతే దూరముండును. అందుకే మన శాసనము అనేక సందర్భాలలో స్నానమును తప్పనిసరి చేసెను. అత్తరు ఉపయోగించాలని ఆదేశించెను. దుర్వాసన కలిగించే వస్తువులు

తిని సమావేశాలకు, మస్జిదునకు రాకూడదని బోధించెను. సారాంశమేమనగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత సంఘటనలతో ప్రపంచము లబ్ధి పొందినది, పొందుచూ పోవును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సంఘటనల నుండి కూడ లబ్ది పొందును. కనుక వాటిని సమకూర్చుట మన విధి. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఒక నవయుకుడు నాకిట్లు చెప్పెను. నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనుచరున్ని. కాని నాకు ఇదొక్కటే గుర్తున్నది. నేను చిన్నగా యున్నప్పుడు నేనొక రోజు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హస్తమును పట్టుకొంటిని. వారితో కరచాలనం చేసితిని. కొంత సమయము వరకు నేను వారి హస్తమును అలాగే పట్టుకొని యుంటిని. కొంత సమయము తరువాత హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హస్తమును విడిపించుకొని మరో కార్యములో నిమగ్నమైరి. బాహ్యముగా ఇదొక చిన్న సంఘటన. కాని తరువాత ఇటువంటి చిన్న చిన్న సంఘటనలతోనే పెద్ద పెద్ద ఫలితములు వెలువడును. ఉదా॥ ఈ సంఘటననే తీసుకొనుము. దీనితో ఒక విషయము చిన్న పిల్లలను కూడ సమావేశాలకు తీసుకొనిరావలెనని రుజువగును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములో ప్రజలు తన పిల్లలను తీసుకొని వచ్చేవారు. పిల్లలను సమావేశాలకు తీసుకొని రావడంతో ప్రయోజనమేమిటి, ఈ సమావేశాలలో పెద్దలను మాత్రమే పాల్గొనాలని అనే ప్రజలు కూడ భవిష్యత్తులో పుట్టే అవకాశముండును. తత్వము వచ్చినప్పుడు ఇటువంటి అనేక విషయములు ఏర్పడును. పిల్లలు ఏమి చేయుదురని అనడం మొదలు పెట్టును. ఇటువంటి ఆలోచన కలిగినప్పుడు ఈ కథనము వారి ఆలోచనను రద్దు చేయును. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం సమావేశాలకు అనుచరులు కూడ బాలలను తీసుకొచ్చేవారని హదీసులలో వ్రాసియున్న విషయము దీనిని బలపరచును. ఏదైనా పని యున్నప్పుడు తమ హస్తమును విడిపించుకొని పనిలో నిమగ్నము కావాలని కూడ దీని ద్వారా తెలియును. నేడు మనము ఈ విషయముల ప్రాముఖ్యతను అర్థము చేసుకోము. కాని అహ్మది, ఫిఖ, అహ్మది తసవ్వుఫ్, అహ్మది తత్వము సిద్ధమైనప్పుడు సాధారణముగా కనిపించే ఈ విషయములు ముఖ్యమైన సూచనలుగా భావించబడును. నేడు కూడ వాటి అవసరము ఏర్పడుచున్నది. గొప్ప గొప్ప తత్వజ్ఞానులు ఈ సంఘటనలను చదివినప్పుడు గంతులేయుదురు. అనగా ఆశ్చర్యము, ఆనందముతో గంతులేయుచు మా చిక్కుముడిని పరిష్కరించిన ఈ కథనమును తెలిపిన వ్యక్తికి అల్లాహ్ తఆలా సత్ఫలితము అందించుగాక అని అందురు. ఇటువంటి సమస్యలు, ఇటువంటి విషయములు ఎదురైనప్పుడు ధర్మముతో సంబంధమున్న తత్వజ్ఞానులు ఈ కథనమును తెలిపిన వ్యక్తి కొరకు ప్రార్థనలు చేయుదురు. మరల వారిట్లనిరి. ఇది ఎటువంటి సంఘటన అనగా మనము హదీసులలో చదువుదుము. ఒక సారి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం సాష్టాంగములో యుండగా హజ్రత్ హసన్ రజియల్లాహు తఆలా అన్‌హు అప్పుడు చిన్నగా యుండిరి. వారి మెడపై పాదములు వేసి కూర్చొనిరి. వారు స్వయముగా క్రిందకు దిగనంత వరకు రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం తల లేపలేదు. ఇటువంటి పని మరెవరైనా చేసినచో కొందరు వ్యక్తులు అతన్ని ధర్మహీనుడని, అల్లాహ్ ప్రార్థన బదులు తన బాలుని భావములను దృష్టియందుంచుకొన్నాడని అనవచ్చును. కాని ఇటువంటి వ్యక్తి ఈ సంఘటనను చదివినప్పుడు అతని ఆలోచన సరికాదని అంగీకరించి మౌనము దాల్చును. ఎందుకనగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉదాహరణ ముందున్నది. ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గురించి మీకు తెలిసిన అతి చిన్న విషయమైనను దానిని చెప్పవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నడుచుకుంటూ గ్రాసముపై కూర్చున్నారను చిన్న విషయమైనా కావచ్చును. ఎందుకనగా ఈ విషయములతో తరువాత ముఖ్యమైన ఫలితములు వెలువడును. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. నాకు గుర్తున్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక సారి మిత్రులతో కలిసి తోటకు వెళ్లిరి. రండి! గింజరహిత (షహ్‌తూత్ ఫలము)ను

ఆరగించుదామని అనిరి. కొందరు మిత్రులు చద్దరు పరచగా, వారు ఫలములు తెంపించిరి. అందరు ఒక చోట కూర్చొని ఈ ఫలమును తినిరి. పెద్ద పెద్ద గర్వితులైన పాలకులు నిరాడంబరముగా తమ మిత్రులతో కలిసి కూర్చొని ఏదైనా తినుటలో అవమానము భావించినప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నిరాడంబరముగా తమ మిత్రులతో కలిసి కూర్చొని తినినప్పుడు ఇందులో అవమానము భావించుటకు మీరెవరని మనము ఈ విషయమును వారికి తెలిపెదము. కొన్ని విషయములు చిన్నవైనా తరువాతి కాలములో పెద్ద పెద్ద ధార్మిక, రాజకీయ, సామాజిక సమస్యలు పరిష్కారమగును.

వారు అనగా హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ముఖమును దర్శించే లేదా వారి సహవాసములో కూర్చొనే అవాకశము లభించినవారు ప్రతి విషయము చిన్నదైనా పెద్దదైనా వ్రాసి భద్రపరచవలెను. ఉదా॥ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వస్త్రధారణ పద్ధతి ఎవరికైనా గుర్తున్నచో వ్రాసి పంపవలెను. వారా కాలములో సూచించిరి. అనంతరం అనుచరులు తమ సంఘటనలను సేకరించడం మొదలు పెట్టిరి, వ్రాయించడం ప్రారంభించిరి. అనుచరుల సంఘటనలతో రిజిస్టరు సిద్ధమైనది. వాటిని నేనొకసారి ప్రస్తావించితిని కూడ. ఈ కథనములు సమకూర్చబడుచున్నవి. ఇన్షాఅల్లాహ్. ఏదో ఒక సందర్భమున జమాఅత్ ముందు ప్రవేశపెట్టబడును.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఈ కథనములతో మరో ప్రయోజనము ఏమి కలుగుననగా మున్ముందు ఏదో ఒక కాలములో మరో చిన్న విషయము అనగా ఖాళీ తలతో యుండవలెనను అభిప్రాయము గల వారు ఏర్పడినచో వారి అభిప్రాయాలను తొలగించవచ్చును. ఒక చిన్న విషయము ఖాళీ తలతో యుండవలెనని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం హదీసులు కూడ గలవు. సాధారణ వ్యక్తులు ఖాళీ తలతో నమాజులు కూడ చదువుదురు. ఈ కథనములతో ఇటువైపు కూడ శ్రద్ధ కలుగును. అనేక సంఘటనలలో మస్జిద్ నియమములు, సమావేశములలో కూర్చునే నియమముల ప్రస్తావన గలదు. నిస్సందేహముగా రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం హదీసులు గలవు. వారే శాసన గ్రహీత సందేశహరులు. అనేగా శాసనమును జారీ చేయువారు. సమీప అవతారుని విషయములు కూడ సందేశగ్రహీత ప్రవక్త విషయములను బలపరచుననుటలో కూడ సందేహము లేదు. ఏ ఫిఖ విషయములను ఇమామ్ అబూహనీఫ ఆచరించిరిచో అవే ఎక్కువ సరియైనవని నేడు కొందరందురు. ఇటులనే రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఏ హదీసులను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆచరించి దృవీకరించిరో వాటినే నిజమైన హదీసులుగా భవిష్యత్తులో భావింతురు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఏ హదీసులను స్వయంకల్పితమని లేదా నిరర్థకమని నిర్ణయించిరో ఆయా హదీసులను అసత్యమని ప్రజలు భావింతురు. హదీసులు ముఖ్యమైనట్లే హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విషయములు కూడ ముఖ్యమైనవే. ఎందుకనగా హదీసుల సత్యా, అసత్యాలను తెలుసుకొనుటకు ఈ విషయములు ఒక ప్రామాణికమగును.

ఈ విషయములో వారిట్లనిరి. నేడు ప్రపంచములో ఇమామ్ బుఖారి గారికి ఎంత గౌరవము గలదు. వారు ఇతరుల నుండి హదీసులను సేకరించినందుకు వారికీ గౌరవము గలదు. అందుకే అనుచరుల సంతానము వద్ద కథనములు యున్నచో వారు తమ ముందు వారికి అందించవలెను. ఇతర కథనములతో అవి సత్యమైనవని తేలినచో వాటిని చేర్చబడును. కొన్ని కథనములు పూర్తిగా రిజిస్టరులో చేర్చబడలేదు కావచ్చును. కనుక అనుచరుల వంశములో కొనసాగుచున్న ఈ కథనములను వ్రాసి పంపవచ్చును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ప్రతి విషయము అన్ని కోణములలో మన కొరకు అనివార్యమైన, ఆచరణాత్మక శిక్షణ కొరకు ఆవశ్యమైన విద్యను కలిగియుండును. ఎందుకనగా ఇందులో శిక్షణా పరమైన అనేక విషయములు వెలువడును. పవిత్ర ఖుర్ఆన్ సూక్తుల విశ్లేషణ అగును, హదీసుల విశ్లేషణ తెలియును, దీని ద్వారా మనకు ప్రయోజనము కలుగును. ఏ అహ్మదీ అయినను ఎవరితోనైనా దీనిని విన్నచో లబ్ధి పొందును, సేకరించిన వారి కొరకు తప్పక ప్రార్థన చేయును. ఇది ఎంతో ముఖ్యమైన విషయము. కొన్ని సార్లు ప్రజలు వీటి వైపు దృష్టి సారించరు. నేడు ప్రశ్నలు చేయువారి కొరకు సమాధానమగు మరో సంఘటనను నేనిప్పుడు ప్రస్తావింతును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి ఆరంభము నుండే ఇస్లాం ప్రగతి పట్ల శ్రద్ధ యుండెను. ముస్లిముల ఆచరణ స్థితి మెరుగుపడాలని వారాశించేవారు. ఆచరణ స్థితి మెరుగుపడుటకు అన్నిటికంటే ముఖ్యమైన విషయము అల్లాహ్ తఆలా ప్రార్థన వైపు శ్రద్ధ వహించుట, నమాజ్ చదువుట. అందుకే ఖాదియాన్‌లో నివాసముండే ముస్లిములు మస్జిద్‌నకు వచ్చి నమాజ్ చేయాలని వారు ఏర్పాట్లు చేసిరి. స్వయముగా మనిషిని పంపి వారిని మస్జిద్‌నకు పిలిపించడం మొదలుపెట్టిరి. అధికులు వ్యవసాయము చేసే నిరుపేదలుండిరి. నమాజ్ చదువుట ధనవంతుల పని మా పని కాదని సాకులు చెప్పడం మొదలు పెట్టిరి. నిరుపేదలమైన మేము సంపాదించాలా లేక నమాజ్ చేయాలా ? కూలీ చేయాలా లేక ఐదు పూటలు నమాజ్ చేస్తుండాలా? కూలీ చేయనిచో మేము పస్తులుండవలసి వచ్చునని అనిరి. సరే మీరు నమాజ్ చేయుటకు రాగలరు, ఒక పూట భోజనం మీకు లభించునని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అనిరి. ఈ ప్రకటన తరువాత కొన్ని రోజుల వరకు భోజనము పేరున 25, 30 మంది నమాజ్ చదువుటకు మస్జిద్‌నకు వచ్చేవారు. కాని చివరకు అలసత్వము వహించుచు, భోజనము లభించే సాయంత్రం మగ్రిబ్ నమాజ్ కొరకు మాత్రమే రావడం మొదలుపెట్టిరి. తుదకు ఈ ఏర్పాటును ముగించవలసి వచ్చెను. వారికీ కోరిక ఎందుకుండెను ? ఇస్లాం స్వచ్ఛమైన చిత్రము కనిపించాలని యుండెను. ఈ విషయమును మనము సదా దృష్టియందుంచుకోవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి ప్రకటన కంటే ముందు తరువాత కూడ ఈ కోరిక యుండెను. నమాజుల వైపు రండి! సామూహిక నమాజ్ చదవండి! మస్జిదులను పూరించండని అనేవారు. ఇప్పుడు అల్లాహ్ తఆలా కృపానుసారము ప్రపంచమంతటా మన మస్జిదులు నిర్మించబడుచున్నవి. కాని వీటిని ఆవాసపరచుటకు అవసరమున్న శ్రద్ధ లేదు. కొన్ని ప్రాంతముల నుండి ఫిర్యాదులు అందుచున్నవి. ఇటులనే రబ్వాలో, ఖాదియాన్‌లో, పాకిస్తాన్‌లో వివిధ ప్రాంతములలో నివసించుచున్న అహ్మదీయులు తమ మస్జిదులను ఆవాసపరచవలెను. ఇదే విధముగా ప్రపంచములోని ఇతర దేశములలో కూడ మస్జిదులను ఆవాసపరచుటకు కృషి చేయవలెను.మరో విషయమునకు కూడ ఇక్కడ సమాధానము లభించును. కొందరందురు, నాకు వ్రాయుదురు కూడ. నవయువకులను మస్జిదులకు రప్పించుటకు ఆటల ఆశ చూపబడును, నవయువకులు సాయంత్రం వచ్చి ఆటలాడిన తరువాత మస్జిద్‌లో నమాజ్ చేయవలెనని ఆటల ఏర్పాటు చేయబడును. కొందరు సమావేశములను నిర్వహించి భోజనము ఏర్పాటు చేయుదురు. భోజనము పేరున ప్రజలు సమావేశములకు వచ్చి భోజనము చేయుదురని కొందరు మాట్లాడుదురు. ఇదొక దురాలోచన. మస్జిదులతో పాటు హాల్ నిర్మించిన చోట లేదా యువకులైన మురబ్బీలు, ముబల్లిఘీన్లు స్వయముగా ఆడుదురు, వారు మైదానము సిద్ధము చేసి, ఆడడం మొదలుపెట్టిరి. నవయువకులను సమావేశపర్చడం మొదలుపెట్టిరి. దీనితో కనీసం ఒక్క ప్రయోజనము ఏమి కలుగుననగా కనీసం ఒకటి రెండు నమాజుల కొరకు ఆ నవయువకులకు మస్జిదుల పట్ల శ్రద్ధ ఏర్పడును. మస్జిదులు నిండును. కనుక మస్జిదుల వెంట ఆటలకు హాలు ఎందుకు నిర్మించిరని, మస్జిదుల వైపు తీసుకరావడానికి వేడుకలను ఎందుకు ఏర్పాటు చేసిరని అనుట లేదా దీనిని నేరమని భావించుట ఒక తప్పుడు విమర్శ. ఇలా జరగవచ్చునని, ఇందులో

ఎలాంటి పొరపాటు లేదని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆచరణతో రుజువైనది.

ఖుత్బా జుమా చివరలో ఇద్దరి వ్యక్తుల మరణమును హుజూరె అన్వర్ ప్రస్తావించి, పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించిరి. మొదటి అంత్యక్రియ ప్రార్థన గౌ॥ అల్‌హాజ్ యాఖూబ్ ఆఫ్ ఘూనా గారిది. వీరు 100 సం॥ల కంటే అధిక ఆయువు పొంది 30 ఆగస్టు 2015 తేదీన మృతిచెందిరి. వీరి సుదీర్ఘ సేవలు, సద్గుణములను, సంతానమును హుజూర్ ప్రస్తావించిరి. వీరి ఇద్దరు కుమారులు జీవితార్పితులు. ఒకరు కేంద్ర మెుబల్లిఘ్ కాగా మరొకరు లొకల్ మిష్నరీగా సేవలందించుచన్నారు.

రెండవ అంత్యక్రియ ప్రార్థన మౌలానా ఫజల్ ఇలాహీ మషీర్ గారిది. వీరు 97 సం॥ల ఆయువు పొంది 3 ఆగస్టు 2015 తేదీన రబ్వాలో మృతిచెందిరి. 1944 సం॥లో జీవితమును సమర్పించిరి. 1978 సం॥లో విశ్రాంతి పొందిరి. వీరి సుదీర్ఘ సేవలను ప్రస్తావించుచు పాలస్తీనా, మారీషస్‌లో సేవలందించున్నప్పటి ఘనకార్యములను ప్రత్యేకముగా హుజూరె అన్వర్ ప్రస్తావించిరి. వీరు 1993 సం॥ వరకు రీ ఇంప్లాయ్‌గా సేవలందించిరి. తుది శ్వాస వరకు వివిధ కోణములలో సేవలందించు అనుగ్రహము పొందిరి. అల్లాహ్ తఆలా వారి స్థాయిని పెంచుగాక! వారి సత్కార్యములను వారి సంతానము కొనసాగించుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! (ఆమీన్)

✡✡✡

BOOK POST (PRINTED MATTER)

To,

..........................................................................

..........................................................................

..........................................................................